అంబరం.. స్వాతంత్ర్య సంబరం

- ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం
- గ్రామ గ్రామానా.. వీధి వీధినా రెపరెపలాడిన మువ్వన్నెల జెండా
- జాతీయ పతాకావిష్కరణలతో ఉట్టిపడిన దేశ భక్తి భావం

జిల్లా వ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పంద్రాగస్టును పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల కార్యాలయాలు, అపార్ట్‌మెంట్లు, గృహాలపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రభుత్వ అధికారులు, ఆయా సంస్థల అధినేతలు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి దేశ భక్తి చాటుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకొని వారి సేవలను కొనియాడారు. ఆ మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని నవభారత నిర్మాణంలో పాలు పంచుకోవాలని పిలుపునిచ్చారు. – సాక్షి నెట్‌వర్క్


పంద్రాగస్టు వేడుకల్లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


కుడా కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న జేసీ డాక్టర్ బి.నవ్య


జెండా వందనం చేస్తున్న డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్


జెండా వందనం చేస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్


ఏపీఎస్పీ రెండవ పటాలంలో జెండా వందనం చేస్తున్న కమాండెంట్ దీపిక పాటిల్


గౌరవ వందనం చేస్తున్న ఉర్దూ వర్సిటీ వీసీ పి.ఎస్.షావలి, రిజిస్ట్రార్ లోకనాథ


మైపర్‌లో జెండా వందనంలో పాల్గొన్న డాక్టర్ ఆదిమూలపు సతీష్


జెండా వందనం చేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

కర్నూలు(సెంట్రల్): జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా పిలుపునిచ్చారు. సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు స్వాతంత్ర్య ఫలాలను అందించి పేదరికాన్ని రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన శుక్రవారం క్యాంపు కార్యాలయం, కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు బ్రిటీషు వారితో పోరాడి ప్రాణాలను సైతం త్యాగం చేశారన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ కూడు, గుడ్డ, గూడు, విద్య, వైద్యం అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.డీఆర్వో వెంకటనారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.


వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న చైర్మన్ కిశోర్‌కుమార్


స్వాతంత్ర్య సమరయోధులకు నివాళ్ళు అర్పిస్తున్న సీఈ కబీర్ బాషా


ఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యాలయంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఇన్‌చార్జ్ ఈదురు పద్మాకర్


ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాలలో జెండా వందనం చేస్తున్న డైరెక్టర్ చంద్రమౌళి


ట్రిపుల్ఐటీడీఎంలో రక్తదానం చేసిన విద్యార్థులకు పండ్లు ఇస్తున్న రిజిస్ట్రార్ రాజ్‌కుమార్


కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో..


సీపీఐ కార్యాలయంలో..


హెల్త్ ఇన్‌స్పెక్టర్ సాయిరాంకు ప్రశంసాపత్రం అందిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టినరసమ్మ


అమీర్ హైదర్‌ఖాన్ నగర్‌లో జెండా వందనం చేస్తున్న పి.నిర్మల


కార్మిక శాఖ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న జేసీఎల్ బాలునాయక్


లక్ష్మీనగర్ మదరసాలో..


డాక్టర్ నర్మదకు ప్రశంసాపత్రం అందిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు


మార్కెట్ యార్డులో జెండా వందనం చేస్తున్న సెక్రటరీ జయలక్ష్మి


రవీంద్ర కళాశాలలో జెండా వందనం చేస్తున్న చైర్మన్ జీవీఎం మోహన్‌కుమార్


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్

క్లుప్తంగా

మాజీ సైనికులకు ఉచిత న్యాయసేవలు


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ.కబర్ధి

కర్నూలు(అర్బన్): జిల్లాలోని మాజీ సైనికుల చట్టబద్ధమైన సమస్యలను పరిష్కరించేందుకు ఉచిత న్యాయ సేవలు అందించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జీ.కబర్ధి చెప్పారు. శుక్రవారం స్థానిక సీ క్యాంప్‌లోని జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో మాజీ సైనికుల కోసం నల్సా వీర్ పరివార్ సహాయత యోజన –2025లో భాగంగా లీగల్ సర్వీసెస్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి బీ.లీలా వెంకటశేషాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి జీ.కబర్ధి మాట్లాడుతూ ఈ క్లినిక్‌లో న్యాయవాదితో పాటు ప్యారా లీగల్ వలంటీరు కూడా ఉంటారన్నారు. లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ.. మాజీ సైనికులందరు ఉచిత న్యాయ సేవలకు అర్హులన్నారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎస్ ఆర్ రత్నరూత్, న్యాయవాది హేమలతారెడ్డి, పారా లీగల్ వలంటీరు మధుసూదన్, మాజీ సైనికోద్యోగులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ కమిటీకి పాలక వర్గం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక వర్గం ఈ నెల 16న పదవీ ప్రమాణ స్వీకారం చేయనుంది. మార్కెట్ కమిటీకి గౌరవ చైర్మన్‌గా కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్, చైర్మన్‌గా గోల్కొండ అజ్మత్ బీ, వైస్ చైర్మన్‌గా కే.శేషగిరి శెట్టి నియమితులయ్యారు. మొత్తం 20 మందితో పాలకవర్గం ఏర్పాటైంది. ఈ మేరకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ గురువారం రాత్రి జీఓ ఆర్‌టీ నంబరు 717 జారీ చేశారు.

స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన మంత్రి

కర్నూలు సిటీ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో 'స్త్రీ శక్తి' పథకాన్ని మంత్రి టీజీ భరత్ శుక్రవారం ప్రారంభించారు. బస్టాండ్‌లోని 9వ ప్లాట్‌ఫాం వద్ద బస్సుకు పూజ చేసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, కూడా చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొని బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు బస్సులో ప్రయాణించి మహిళలకు ఉచిత ప్రయాణ టికెట్లను అందజేశారు. పథకాన్ని ప్రారంభించేందుకు నిర్ణయించిన 9వ ప్లాట్ ఫాం వద్ద మాత్రమే రంగులు కొట్టి బస్టాండ్ మొత్తం శుభ్రంగా ఉందనే అభిప్రాయం కలిగేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. అపరిశుభ్రంగా ఉన్నప్పటికీ శుభ్రం చేయకుండా కేవలం బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వేదికపై ఆర్టీసీ అధికారులకు కనీసం కుర్చీలు కూడా లేకపోవడంతో కార్యక్రమం అయ్యేంత వరకు నిలబడే ఉన్నారు. ఆర్టీసీ ఆర్ఎం టి.శ్రీనివాసులు, డీసీఎంఎస్ చైర్మెన్ నాగేశ్వరయాదవ్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, నగరపాలక కమిషనర్ విశ్వనాథ్, ఆర్టీసీ డిపో మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


గంధం అలంకరణలో లలితా త్రిపురసుందరి


చిన్న అమ్మవారి శాలలో..

కర్నూలు కల్చరల్: శ్రావణ మాసం నాల్గవ శుక్రవారం పురస్కరించుకొని నగరంలోని అమ్మవారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్ర పారాయణాలు చేశారు. పాతనగరంలోని లలితా పీఠంలో లలితా సుందరేశ్వరిని గంధంతో అలంకరించి మొక్కులు చెల్లించుకున్నారు. చిన్న అమ్మవారి శాల, పెద్దఅమ్మవారి శాల, నిమిషాంబదేవి ఆలయం, కాశికాంబ దేవి ఆలయం, మాతా అంబా భవానీ ఆలయం, అరోరా నగర్ రాజరాజేశ్వరీ దేవి ఆలయం, సూర్యనారాయణ స్వామి ఆలయం, నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయం, హరిశ్చంద్ర శరీన్ నగర్‌లోని త్యాగరాజ సీతారామాలయాలు భక్తులతో సందడిగా మారాయి.

నగరపాలకలో జెండా పండుగ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగర మేయర్ బీవై రామయ్య, కమిషనర్ పి.విశ్వనాథ్‌తో కలిసి జాతీయ జెండాను ఎగురవేశారు. నగరపాలకలోని ఆయా విభాగాల్లో ప్రతిభ కనబరచిన అధికారులకు, సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం మనకు సులభంగా రాలేదని, అనేక మంది యోధుల త్యాగనిరతితో మనం నేడు స్వేచ్ఛా జీవనం పొందుతున్నామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. పరిశుభ్రమైన కర్నూలు సాధనలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం కీలకమన్నారు. అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించిన 'సైరా'

కర్నూలు కల్చరల్: స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని సి.క్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన 'సై సైరా నరసింహారెడ్డి' చారిత్రాత్మక పద్యనాటకం స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించింది. మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథిగా హాజరై నాటకాన్ని ప్రారంభించి మాట్లాడారు. స్మార్ట్ ఫోన్లు, ఇతర సాంకేతిక రంగాల్లో విద్యార్థులు తలమునకలవుతున్న రోజుల్లో నాటక రంగం, సాహితీ రంగం వారిని ఆకర్షించాల్సిన అవసరం ఉందన్నారు. కళాకారుల సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సభకు అధ్యక్షత వహించిన పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి మాట్లాడుతూ.. 200 ఏళ్ల క్రితం జిల్లాలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత చరిత్ర మనకు ఆదర్శమన్నారు. దీన్ని నాటక రూపంలో బుడ్డా వెంగళరెడ్డి తీసుకొచ్చారని, అనంతరం కళాక్షేత్రం కొనసాగిస్తుందన్నారు. నాటక కళాకారులను సన్మానించారు. అనంతరం కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ప్రదర్శించిన సై సైరా నరసింహారెడ్డి నాటకం ఆహూతులను అలరించింది. కార్యదర్శి యాగంటి ఈశ్వరప్ప, ఉపాధ్యక్షుడు దాసెట్టి శ్రీనివాసులు, మహమ్మద్ మియా, సభ్యులు కేవీ రమణ, జీవీ శ్రీనివాస్‌రెడ్డి, రాజరత్నం, ఇనాయతుల్లా, తదితరులు పాల్గొన్నారు.


కళాకారులతో మంత్రి టీజీ భరత్

తేనీటి విందు

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రజాప్రతినిధులు, అధికారులకు తేనీటి విందు ఇచ్చారు. శుక్రవారం రాత్రి 6 గంటల నుంచి ప్రారంభమైన కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎస్పీ విక్రాంత్‌పాటిల్, మేయర్ బీవై రామయ్య, జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో సి.వెంకటనారాయణమ్మతోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. వారందరికీ కలెక్టర్ స్వాగతం పలికి తేనీటి విందుకు ఆహ్వానించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున అధికారులు, ప్రజాప్రతినిధులకు కలెక్టర్ తేనీటి విందును ఏర్పాటు చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులను కలెక్టర్, మంత్రి సన్మానించారు.


తేనీటి విందుకు హాజరైన మంత్రి టీజీ భరత్ తదితరులు


ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

కృష్ణం వందే జగద్గురుమ్

- నేడు శ్రీకృష్ణ జన్మాష్టమి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- చిన్నికృష్ణులు, గోపికల వేషధారణ పోటీలు
- ఆధ్యాత్మిక ప్రవచనాలు, నృత్యప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: దేశవ్యాప్తంగా హిందువులు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించుకునే వేడుకల్లో శ్రీకృష్ణాష్టమి ఒకటి. వివిధ ఆలయాల్లో, పలు సంస్థల ఆధ్వర్యంలో ఎంతో వైభవంగా నిర్వహించే గోకులాష్టమి వేడుకలు శనివారం నిర్వహించుకోనున్నారు. శ్రీకృష్ణుడి అవతారమంతా లీలామయమే. శ్రీకృష్ణాష్టమి పర్వదినం రోజున కృష్ణుడి ఆలయాల్లో నిర్వహించే సంబరాలు అంబరాన్నంటనున్నాయి. చిన్నారుల చిలిపి చేష్టలు గోపికల వయ్యారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. కృష్ణ తత్వం బోధించే పాటలు, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకోనున్నాయి. సోమవారం శ్రీకృష్ణాష్టమిని పురష్కరించుకొని శనివారం శ్రీకృష్ణుడి జయంతి వేడుకలను జరుపుకోనున్నారు.

వేడుకలు ఇలా..

కర్నూలు నగరంలో ఇస్కాన్, చిన్మయ మిషన్, గో సంరక్షణ శాల, బీక్యాంప్ విజ్ఞాన మందిరం, నంద్యాల చెక్‌పోస్ట్ శ్రీకృష్ణ ఆలయం, లలితా పీఠం, సూర్యనారాయణ స్వామి, సత్యనారాయణ స్వామి ఆలయాల్లో వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.


శ్రీకృష్ణ ఆలయం

ఇస్కాన్ ఆధ్వర్యంలో

అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఈ నెల 16, 17 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, శ్రీల ప్రభుపాదుల వారి 129వ శ్రీ వ్యాస పూజ మహోత్సవం నిర్వహించనున్నారు. నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో తెల్లవారుజాము నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా శుభ మంగళ హారతి, దర్శన హారతి, ప్రత్యేక హరినామ సంకీర్తన, సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, 7 గంటలకు శ్రీ రాధాగోవిందులకు మహా శంఖాభిషేకం, 108 రకాల ఆహార పదార్థాలచే మహా రాజ భోగ నివేదన, జగన్నాథ్ దర్శనం కార్యక్రమాలు, 17వ తేదీ భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో శ్రీల ప్రభుపాద వారి 129వ వ్యాస పూజలో భాగంగా ఉదయం 8 గంటలకు దర్శన హారతి, 11 గంటలకు మహాంఖాభిషేకం, ప్రవచనం, మహా హారతి, పుష్పాంజలి, శ్రీల ప్రభుపాద వారి ప్రేమ విందు కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రుక్మిణీ సమేత శ్రీకృష్ణ ఆలయంలో వేడుకలు

నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీకృష్ణ ఆలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నాం. రాత్రి 12 గంటలకు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు, లాలి పాటలు. ఉదయం 6 గంటలకు శ్రీకృష్ణ రుక్మిణి మాత అభిషేకం, పూజా వేడుకలు, 9 గంటలకు కలెక్టరేట్ నుంచి కృష్ణ మందిరం వరకు శ్రీకృష్ణుడి చిత్రపటంతో ఊరేగింపు, 12 గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం, అనంతరం సభ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

– అయ్యన్న యాదవ్, ఆలయ కమిటీ ప్రతినిధి

భక్తిశ్రద్ధలతో లక్ష కుసుమార్చన


ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ దేవి

కర్నూలు కల్చరల్: స్థానిక సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని చౌడేశ్వరీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, అర్చనలు, వివిధ రకాల లక్ష పుష్పాలతో అర్చన, సామూహిక కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, తదితర పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకొని దీప హారతులు ఇచ్చారు. తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భరత మాత మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న భక్తులు